ఏ బంధమూ
లేక పోయినా
ఆ పాపకోసం
అతనెందుకు
తాపత్రయపడుతున్నాడు?

## శ్రీరంగం కథ

# బంధం

బోయింగ్ విమానం కిటికీలోంచి క్రిందకు చూసింది సరిత.

కెమెరాలో బంధింపబడిన ఫొటోగ్రాఫ్‌లా కనిపిస్తున్నాయి క్రింది ఉన్న సీనరీలు.

ఇవన్నీ ఆహ్లాదం కలిగించేవే.

కాని మనస్సు వీటిమీద లగ్నం కావటం లేదు. కారణం తన భర్త విజయ్ మౌనం — అది ఎంతో కుతూహలాన్ని రేకెత్తిస్తూంది.

నిన్నటి నించి అతని చేష్టలు అన్నీ గమనిస్తూనే వుంది. తనకు అర్థం కాలేదు.

అతన్ని గురించి క్షుణ్ణంగా తనకు తెలిసి ఉండకపోతే అతనికి పిచ్చి ఎక్కింది అని అనుకుని ఉండేది.

రాకెట్ ఫైర్ చేయడానికి కౌంట్ డవున్‌లా నిలవించి పలకరిస్తున్నాడు, అమ్మని చూడాలని.

తను కూడా చాలా ఆనందపడింది. అత్తని చూడబోతున్నానని. తమ పెళ్ళి అయి ఏడాదిన్నర అయింది. అమెరికాలో అయినందువల్ల — చాలా సింపుల్‌గా జరిగిపోయింది.

రెండు సంవత్సరాలు కాగానే నెలరోజులు సెలవులు వచ్చేయి. తనకు విజయ్ అన్న మాటలు జ్ఞాపకం వచ్చేయి.

'నాకూ ఆ దేశానికీ ఉన్న సంబంధం అమ్మే. ఆమెగాని లేకపోతే నేను అక్కడికి వెళ్ళవలసిన పనే లేదు.

నా బాధలూ—

దుఃఖాలూ—



అవమానాలూ అన్నీ అక్కడే ఉన్నాయి. వాటిని అన్నీ ఇక్కడకు వచ్చి మరచిపోయేను.

నేను తిరిగి ఆ దేశానికి వెళ్తే -- అవన్నీ రేకెత్తికుంటున్నట్టు అవుతుంది. అయినా వెళ్లక తప్పదు. అక్కడ అమ్మ ఉంది కాబట్టి" అన్నాడు.

తనకూ ఎన్నాళ్ళ నుంచో ఇండియా చూడాలని ఉంది. తను పుట్టి పెరిగింది అమెరికాలోనే. తన తల్లిదండ్రులు అక్కడ సెటిల్ అయిపోయేరు. విజయ్‌తో అయినా ఇండియా చూస్తున్నాను అన్న సంబరపడింది.

కాని అతని ప్రవర్తన.

ముఖ్యంగా ఒక్కరోజు ముందర జరిగిన సంఘటన

అర్థం చేసుకోవాలని ప్రయత్నించి విఫలం అయింది.

రెండు రోజుల క్రిందట — 'సరీ! మార్కెట్టుకు వెళ్ళాలి' అన్నాడు.

'ఎందుకండీ' అంది.

'అమ్మకు కొన్ని వస్తువులు కొనాలి' అన్నాడు.

'సరే' అంది.

విజయ్ మొదట ఆకర్షణీయమైన బొమ్మల షాపు ముందు ఆగేడు.

తను ప్రశ్నించే లోపలే అతను కారుదిగి షాపులోకి వెళ్ళేడు.

ఎన్నో బొమ్మల్ని సెలక్టు చేసేడు.

అన్నీ అయిదు ఆరు ఏళ్ళ వాళ్ళు ఆడుకునే బొమ్మలే.

తనకు ఆశ్చర్యం వేసింది. అమ్మ తప్పితే ఇంకొకరి గురించి మాట్లాడి ఎరుగని విజయ్ ఇన్ని బొమ్మలు ఎవరికి కొంటున్నాడని.

ఉండబట్టలేక 'ఎందుకండీ ఇవన్నీ' అంది.

అతను మాట్లాడలేదు.

తను కూడా ఇంక అడగలేదు.

ప్యాక్ చేయించినవన్నీ కారులో పెట్టించి కారు స్టార్ట్ చేసి ఇంకో స్థలానికి వెళ్ళేడు.

అది రెడీమేడ్ బట్టల దుకాణం.

తనని అనుమానం పీకుతూనే ఉంది.

విజయ్ రెడీమేడ్ బట్టల షాపులోకి ఎందుకెళుతున్నాడు. ఇక్కడ చీరలు ఉండవే. అన్నీ గౌనులు, ఫ్రాకులే. తను నోరు తెరవకుండానే అతను షాపులో జొరబడ్డాడు. అయిదు ఆరు సంవత్సరాల సైజు వారికి పట్టే ఫ్రాకులు ప్రక్కకు పెట్టి 'ఎలా ఉన్నాయి' అన్నాడు.

'బాగున్నాయి... కాని'

తన్ను మాట్లాడనీయలేదు.

ప్యాక్ చేయించి డబ్బులు చెల్లించి కారులో పెట్టించేడు.

అటు తర్వాత ఒక టాఫీ షాపు ముందు ఆగింది కారు. రకరకాల రేపర్‌లో ఉన్న చాక్లెట్లు.

అటు తర్వాత చిన్నపిల్లలు ఆడుకునే గేమ్స్ బాక్సులు — కారు నిండిపోయింది సామానుతో.

ఇవన్నీ ఎవరో స్నేహితుని పాపకు అని సరిపెట్టుకుంది.

ఆఖరికి తల్లి గురించి ఏమయినా తీసుకుంటాడేమో అనుకుంది. కాని ఆశ్చర్యం.

కారు ఇంటి దారి పట్టేటప్పటికి 'ఏమండీ! అమ్మకు ఏమయినా తీసుకోరా?' అని అడిగింది.

అతను జవాబు చెప్పలేదు.

కాని కళ్ళలో ఉద్వేగపు పొర.

తను ఎక్కువ మాట్లాడితే – అతను ఏడ్చేలా ఉన్నాడు.

ఇక ఆ విషయం కదిలించలేదు.

'అమ్మ! అమ్మ!' అంటూ కలవరించే విజయ్ అమ్మకు వొక్కటి కూడా కొనలేదు.

తను యిద్దరి కలయికలో – అప్పుడప్పుడు అమ్మ గురించి చెప్పేవాడు.

ఆమె ఆప్యాయత–

ఆ ఆదరించే చూపు–

కొడుకు వృద్ధికి రావాలని చేసిన త్యాగాలు

అందరూ హీనంగా చూసిన విజయ్ – స్వదేశాన్ని కట్టుబట్టలతో వొదలి ఈ స్థితికి చేరుకున్నాడంటే.

దానికి

అమ్మ వొక సోపానం అయింది.

ఆమె కష్టం అనే మెట్ల మీద ఇతను ఎత్తుకు వెళ్ళగలిగేడు.

అలాంటి తల్లికి

కనీసం వొక్క చీర–

లేకపోతే అభిమానాన్ని ప్రదర్శించే వస్తువును కొనడం లేదు–

వొక పాప గురించి బండెడు సామాను కొన్నాడంటే–

విజయ్ గురించి ఏం అనుకోవాలి.


తన్ను నోరు మెదపి మాట్లాడనీయలేదు కూడా.

గడియారం చూసుకుని.

ఇంకో అయిదు నిముషాల్లో ప్లేన్ లాండ్ అవుతుంది.

అంటే ఇక్కడ దొరుకుతుంది అతని చేష్టలకు జవాబు.

తన ఆలోచనలోంచి బయటికి వచ్చి విజయ్‌ని చూసింది.



అతను గతంలో విహరిస్తూన్నట్టు —పరధ్యానంలో ఉన్నాడు.

ప్లేన్ ఎక్కినప్పటి నుంచి అతని మూడ్‌లో మార్పేలేదు.

ఎయిర్‌హోస్టెస్ ప్లేన్ లాండ్ అవుతుందని హెచ్చరిస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పడంతో — విజయ్ స్పృహలోకి వచ్చినట్టు గడియారం చూసుకున్నాడు.

అతను ఇన్ని గంటలు తన పక్కన ఉన్నా

వొక్కమాట మాట్లాడలేదు.

మౌనం. మౌనం. మౌనం.

ప్లేన్ ఆగింది. అందులోంచి తాము ఇద్దరూ దిగేరు.

బయటికి వచ్చి సామాను కస్టమ్స్ క్లియరెన్స్ అయింతర్వాత టాక్సీలో చాలా జాగ్రత్తగా వేయించేడు.

జాగ్రత్తగా సామాను ఎత్తబోతున్న కూలీలను అదిలించేడు 'జాగ్రత్త!' అంటూ.

సామానులు కాపాడుకొనేందుకు అతి జాగ్రత్త చూపిస్తున్నాడు.

చివరికి వొక చిన్న టెంపోలో సామాను వేయించి తాము ఇద్దరూ టాక్సీ ఎక్కేరు.

తను ఎంతో ఆత్రంగా ఎదురుచూసింది విజయ్ ఫలవరిస్తూన్న అత్తగారు వస్తుందని.

మిగతా పాసింజర్లను అందరినీ వాళ్ళ వాళ్ళు రిసీవ్ చేసుకున్నారు వొక్క తమ్ము తప్ప.

కనీసం — ఇంత సామాను తెచ్చిన పాప తల్లిదండ్రులు అయినా వస్తారు అనుకుంది అత్తగారు కనిపించకపోతే.

వాళ్ళూ రాలేదు.

పరాయి స్థలంలో — ఇన్నివేల మైళ్ళు ప్రయాణం చేసి వచ్చింతర్వాత చిరునవ్వుతో

తమ్ము పలుకరించే ముఖం అయినా లేకపోతే మనస్సు చివుక్కుమంటుంది.

కాని ఆశ్చర్యం

విజయ్ ముఖంలో ఎలాంటి భావాలూ లేవు.

టాక్సీ డ్రైవర్ అడిగేడు 'ఎక్కడికి తీసుకెళ్ళమంటారు సార్' అని.

అతను వొక హోటల్ పేరు చెప్పేడు.

అప్పటిదాకా నోరు మూసుకున్న సరిత నోరు తెరచి

"హోటల్ ఎందుకు? మీ అమ్మ ఇల్లు..."

తమ్ను పూర్తిగా చెప్పనీయలేదు. అతను చేయి ఎత్తేడు మాట్లాడవద్దు అన్నట్లు.

అత్యాధునికమైన హోటల్లో టాక్సీ ఆగింది.

హోటల్ బెల్‌బాయ్ పరుగెత్తుకుంటూ వచ్చేడు.

విజయ్ టాక్సీ దిగి మేనేజర్ దగ్గరికి వచ్చి "కాస్త్లీయస్ట్ రూం పెద్దది" అన్నాడు.

మేనేజర్ కావలసిన సమాచారం అంతా పుస్తకంలో ఎంటర్ చేసి సంతకం తీసుకున్నాడు.

"నా సామను టెంపోలో ఉంది. దాన్ని

చాలా జాగ్రత్తగా చేర్చాలి" అన్నాడు విజయ్ మేనేజర్‌తో.

"సరే సార్" అని అతను అనగానే విజయ్ పర్స్ తీసి అడ్వాన్సు చెల్లించి "నేను టెంపో దగ్గరకు వెళ్తాను. ఎవరినేనా పంపించండి షిఫ్ట్ చేసేందుకు" అన్నాడు.

"మీరు రూంకెళ్ళి రిలాక్సవండి. నేను జాగ్రత్తగా పంపిస్తాను" అని బెల్‌బాయ్‌కి "సార్‌ని రూంకి తీసుకెళ్ళు" అన్నాడు.

"అలా కాదు షిఫ్ట్ చేస్తున్నప్పుడు నేను ఉండాలి. అది అంతా చాలా నాజూకు అయిన సామాను"

"మీ సామాన్ని చాలా జాగ్రత్తగా పంపిస్తాను. మీరు సూట్‌కెళ్ళి కాస్త రిఫ్రెష్ అవండి"

'ఇది వీలు పడదు' అన్నట్టు తలతిప్పి టెంపో దగ్గరకు వెళ్ళిపోయేడు.

సరితకు రాను రాను మిస్టరీ అధికం అవుతూంది తప్పితే తగ్గడం లేదు.

అరగంటలో సామాను గదిలోకి వచ్చేసింది.

దాని వెనక విజయ్ కూడా వచ్చేసేడు.

ముఖం కడుక్కుని కాఫీ ఆర్డర్ చేసి టెలిఫోన్ తీసుకుని మేనేజర్‌తో "నాకో టాక్సీ కావాలి" అన్నాడు.

"ఎక్కడికి వెళ్లాలి సార్!" అన్నాడు మేనేజర్.

"ఇప్పుడు అది చెప్పలేను. కాని ఈరోజంతా ఎంగేజ్ అయి నాతో ఉండాలి టాక్సీ"

"సరే సార్. పది నిముషాల్లో వస్తుంది."

కాఫీ విజయ్ సరిత తీసుకునేటప్పటికి టాక్సీ వచ్చింది.

"పద" అన్నాడు సరితతో

"మరి మీరు తెచ్చిన సామానో?" అంది సరిత.

"అది ఇక్కడే ఉండనీ" అని "కెమెరా మాత్రం తీసుకో" అన్నాడు. మెళ్ళో కెమెరా వేసుకుని "పదండి" అంది సరిత.

విజయ్ టాక్సీలో కూర్చున్న తర్వాత "ఎక్కడికి సార్" అన్నాడు టాక్సీవాడు.

"హిల్ స్ట్రీట్" అన్నాడు విజయ్.



## డైటింగ్

కత్తులు, బాకులు మింగడంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన సింధవర్ణరావు మరో ప్రదర్శన ఏర్పాటు చేశాడు. కానీ ఆ ప్రదర్శనలో సింధవర్ణరావు మామూలుగా చిన్నచిన్న సూదులు, బ్లేడ్లు తిన్నాడు.

"అదేమిటండీ ఎప్పుడూ పెద్దపెద్ద కత్తులు, బాకులు మింగేవాడు. ఇప్పుడు కేవలం కత్తులు, బాకులు మింగుతున్నాడు" అడిగాడు మూర్తి ప్రదర్శన ఏర్పాటు చేసిన వ్యక్తిని.

"ఈ మధ్య అతను డైటింగ్ చేస్తున్నాట్లెండి" చెప్పాడు ఆ వ్యక్తి.

అమ్మురుని రాజ్యశ్రీ (హైదరాబాద్)

పదిహేను నిముషాలు కుదుపులు భరించలేక టాక్సీ ఆగింది.

టాక్సీ దిగి "ఇక్కడే ఉందు" అని బోర్డులు వొకటి తర్వాత మరొకటి చూసుకుంటూ వెళ్తున్నాడు.

"ఆర్ఫనేజ్ బోర్డింగ్ స్కూలు" అన్న బోర్డు దగ్గర ఆగి మూసిఉన్న గేటు తోసుకుని లోపలికి వెళ్ళేడు.

అక్కడున్న వాచ్‌మన్‌తో "ఫాదర్ గదేది?" అంటూ అడిగేడు.

వాచ్‌మెన్ వేలు చూపించేడు.

మెట్లెక్కి గది ముందర తలుపు మీద చిన్నగా శబ్దం చేసేడు. "కమిన్" అన్న కంఠస్వరం.

లోనికి వెళ్ళి కుర్చీలో కూర్చొని ఫైల్స్ చూసుకుంటూన్న అతనితో తన్ను తాను పరిచయం చేసుకుని "నేను లెటర్ రాసేను" అన్నాడు. "అందింది మిస్టర్ విజయ్. మీ గురించే వెయిట్ చేస్తున్నాను"

"మరి వెళ్దామా" అన్నాడు విజయ్ కుర్చీలో కూర్చోకుండానే.

"మీ ఆతృత నాకు తెలుసు. పదండి" అన్నాడు.

ఫాదర్ ముందు, అటు తర్వాత విజయ్, వెనుక సరిత వసారా దాటి వొక చిన్న లాన్ ముందరకు వచ్చేరు.

అక్కడ అయిదు నించి పదేళ్ళలోపు ఆడపిల్లలు — వొక ఇరవైదాకా ఆడుకుంటున్నారు.

తమకు తోడులేదు. నీడ లేదు — అన్న బాధేలేదు వాళ్ళ ముఖాల్లో.

గంతులు వేసుకుంటూ పరుగెత్తుతున్న వారిని చూస్తూ ఫాదర్ "స్వీటీ" అంటూ పిలిచాడు.

ఆరేళ్ళ పిల్ల ఎగురుతూ వచ్చింది.

"గుడ్‌మార్నింగ్ చెప్పమ్మా అంకుల్‌కీ ఆంటీకీ"

విష్ చేసింది స్వీటీ.

ముద్దుగా ఉంది పాప.

మామూలు గౌనులో ఉంది.

విజయ్ చూస్తూంది ఆ పాపని కాదు.

ఆ కళ్ళని.

నిర్మలంగా

స్వచ్ఛంగా ఉన్న ఆ కళ్ళను అలానే చూస్తూ ఉండిపోయేడు.

రెప్పవేయకుండా అలానే చూస్తున్న విజయ్‌ని చూసి అయోమయంలో పడింది సరిత.

"ఎంత బాగున్నాయో ఆ కన్నులు" ఆ మాటలు ఎవరితో అన్నవి కావు. అతని హృదిలోని భావాలు అసంకల్పితంగా పదాలు కల్పించుకుని బయటికి వచ్చేయి.

తన్ను ఉద్దేశించి అన్నవి కాకపోయినా ఆ కన్నుల వైపు చూసింది సరిత

కొంచెం పెద్దగా ఉన్నాయి తప్పితే ఇంకే విశేషం లేదు.

'ఇంత ఆతృతపడి అంతదూరం నించి వచ్చింది ఈ కన్నుల గురించా' అనుకుంది

సరిత.

"సరితా ఒకసారి కెమెరా తే." అని దాన్ని అందుకుని పాపని ముందు ప్రక్కల నించి ఫోటో తీసేరు.

ఆ పని అవగానే ఫాదర్‌తో "నేను పాపని కొంచెంసేపు బయటికి తీసుకువెళ్లొచ్చా"

"వెళ్ళండి. కాని చీకటి పడకుండానే వచ్చేయండి"

"సరే"

టాక్సీలో కూర్చుని మొదట దగ్గరలో ఉన్న అయిస్‌క్రీం పార్లర్‌కు వెళ్ళి "మూడు అయిస్‌క్రీం" ఆర్డరు చేసేరు.

ముగ్గురూ మూడు తిన్నారు.

అంతసేపూ సరిత పాపనీ, విజయ్‌నీ చూస్తూంది. వారిద్దరిలో చెప్పుకోదగ్గంత చనువు లేదు.

పాప చాలా ముభావంగా అంటీ అంటనట్టు ఉంటూంది.

"ఈ అమ్మాయి గురించి విజయ్ ఇలా ఎందుకు అయిపోతూన్నాడు" అర్థం కావడంలేదు.

ప్లేన్ దిగి రెండు గంటలయినా కలవరించి తపించిపోయే "అమ్మ" గురించి ఒక్క పదం అతని నోటి వెంబడి రాలేదు.

మిస్టరీ లోతు అవుతుంది.

"ఎవరీ పాప? ఏ బంధం అతన్ని ఆమెతో కలిపింది. ఏది అతన్ని ఇంత దూరం రప్పించింది? ఏది అతన్ని అమ్మనే విస్మరించేటట్టు చేసింది?"

అన్నీ ప్రశ్నలు.

ప్రస్తుతం జవాబురాని ప్రశ్నలు.

"పద" అన్నాడు సరితతో వెయిటర్‌కి డబ్బు చెల్లించి.

సరిత లేచి నిలబడింది.

ముగ్గురూ టాక్సీలో కూర్చున్న తర్వాత "ఇక్కడ ఈ రీల్‌ని డెవలప్ చేసే ఫొటోగ్రాఫరు దగ్గరికి తీసుకెళ్ళు" అన్నాడు టాక్సీవాడితో.

స్టూడియోలో కెమెరా నించి రీల్ తీసి "ఎంత సేపటిలో డెవలప్ చేస్తారు?" అని



## ముగ్గురు దేవుళ్ళ ముచ్చట

అది అమెరికాలోని పెన్సిల్‌వేనియా రాష్ట్రానికి చెందిన వెస్కాప్ నగరం. ఆ నగరంలో మూడు వందల భారతీయ కుటుంబాలు వున్నాయి. వారంతా కలిసి మూడున్నర ఎకరాల స్థలంలో ఏడువేల చదరపు అడుగుల వైశాల్యంతో 1984లో అతి అరుదైన దేవాలయాన్ని 39 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించారు! ఆ దేవాలయ ఆవరణలో మూడు మతాలకు చెందిన రాధాకృష్ణులు, గురు గ్రంథిసాహిబ్, మహావీర్‌స్వామిల దేవాలయాలు ఒకదాని పక్కన ఒకటి వున్నాయి. మత సమైక్యత అంటే అది సార్.

—జూపిటర్

అడిగేడు.

"అర్జంటు అయితే నాలుగు గంటలు"

డబ్బుఇచ్చి ఇంకో ఇరవై రూపాయలు ఎక్కువ ఇచ్చి "ప్రింటులు ఈ హోటల్‌కు పంపించండి"

"సరే" అన్నాడు స్టూడియో ఓనరు.

టాక్సీలో తిరిగి కూర్చున్న తర్వాత "హోటల్‌కు పోనియ్" అన్నాడు.

"మీరు రోజు అంతా ఎంగేజ్ చేసేరు. మరి హోటల్‌కు వెళ్ళిపోతున్నారు ఏంటి?"

"మనస్సు మార్చుకున్నాను"

టాక్సీ వెళుతూంది. విజయ్ పాపని వొళ్ళో కూర్చోబెట్టుకుని తల నిమురుతున్నాడు.

చూస్తున్న సరితకు ఇది విచిత్రంగా కనిపించింది.

అతని ఆప్యాయతలో — తండ్రీ కూతుళ్ళ అనుబంధం లేదు.

ఇంకేదో ఉంది.

అది ఏమిటో?

తను ఇప్పటివరకు ఎరుగదు.

కాని

విచిత్రంగా ఉంది.

అతన్ని ఆ స్థితిలో చూస్తూంటే ఆమెకు — అసూయ కలగలేదు.

ఇది ఏమిటో? తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతూంది.

పదిహేను నిముషాల తర్వాత హోటల్ గదిలో విజయ్ వొక పాకెట్ తర్వాత వొకటి తెరచి పాపకు యిస్తున్నాడు.

పాప అందుకుంటూంటే — అతను ఆ ముఖాన్నే చూస్తున్నాడు.

మొత్తం ముఖం కాదు.

ముఖంలో వొక్క భాగాన్నే.

అందులో వెలువడుతూన్న ఆనందాన్ని చూసి తన్మయం అవుతున్నాడు. సరితకు సీన్ వొకటే. కాని విజయ్ ముఖంలో భావాలు ఎన్నో.

ముఖం అన్నిభావాలను ప్రదర్శించగలదని ఆమెకు తెలియనే తెలియదు.

గంట తర్వాత గంట గడుస్తూంది.

గది అంతా పేకింగ్ విప్పిన కాగితాలతో పడి ఉంది.

గోడ గడియారం ఏడు కొట్టింది.

పాప లేచి "నేను వెళ్ళాలి చీకటి పడింది!" అంది.

"సరితా పాపని నేను దింపి వస్తాను" అని ఆమె సమాధానం ఎదురుచూడకుండా బయటికి వచ్చేడు.

విజయ్ వెళ్ళిన సరిగ్గా అయిదు నిముషాలకు

హోటల్ బాయ్ తలుపుకొట్టి పర్మిషన్ తీసుకుని లోనికి వచ్చి

"మేడం ఇవి స్టూడియోవాళ్ళు పంపించేరు" అంటూ కవర్ అందించేడు.

కవర్ బరువుగా ఉంది.

అవి విజయ్ తీసిన ఫోటోలు అని సరితకు తెలుసు.

కవర్ తెరిచి వొక్కో ఫోటో

చూడసాగింది.

ఆమెకు షాక్ అనిపించింది.

సుమారు యాభై ఫొటోలు.

ఎందులోనూ పాప లేదు.

కాని ఆమె కళ్ళు మాత్రం ఉన్నాయి.

దగ్గర నించి దూరం నించి ప్రక్క నించి 'జూమ్' ఎడ్జస్ట్ చేసి తీసిన ఫోటోలు.

బెడ్‌మీద వరుసగా పేర్చింది సరిత.

ఆమెకు మతిపోతూంది.

విజయ్ ఫోటో తీస్తానంటూ వొక్క కళ్లే తీయడం ఏంటి?

"ఇందులో అర్థం అంటూ ఉందా?"

ఆలోచిస్తూంది.

"హాయ్!" అన్న చేయి భుజం మీద పడటంతో తల ఎత్తింది.

విందు ఆరగించిన ముఖంలా సంతోషంతో వెలిగిపోతూ విజయ్.

అతని చూపులు బెడ్‌మీద నిలిచిపోయేయి.

"ఫోటోలు వచ్చేసేయ్" అంటూ సంతోషంతో వొక ఫోటో ఎత్తి "ఎంత బాగున్నాయి ఈ కన్నులు. ఇందులో ఎంత అభిమానం ఉంది" అన్నాడు స్వగతంలా.

అప్పటిదాకా ఆ మాట చాలాసార్లు వింది.

ఇంత సేపూ వింది. ఇక వినలేకపోయింది.

"అమ్మని కలుద్దాం అంటూ ఇంత దూరం తీసుకువచ్చి, ఇదంతా ఏమిటి?" అంది అసహనంగా.

"అమ్మనే కలిసేం ఇంతసేపూ?"

"అంటే"

"అవి అమ్మ కళ్ళే?"

అర్థం కానిదానిలా ముఖం పెట్టింది సరిత.

తల్లి గురించిన దాహంలో సరితకు



యింతవరకూ చెప్పలేక పోయేడు. ఇప్పుడు సంతోషంగా ఉన్నాడు.

విజయ్ పెదాలు విచ్చుకున్నాయ్.

"సరితా నేను చాలా నికృష్టమయిన పరిస్థితుల్లో ఈ దేశాన్ని వదిలేను. తను మాడి అమ్మ నాకు కడుపు నింపేది. తన రక్తాన్ని ధారపోసి నన్ను చదివించింది. ఇక్కడ ఉద్యోగం లేకుండా అలమటించిపోతూన్న రోజుల్లో — అమ్మ — ఆ నిర్మలమైన చూపు — అభిమానం అదే అండదండ అయింది. నేను డబ్బు సంపాదించి అమ్మని సుఖపెడదాం అని రెండేళ్ళ క్రిందట ఇక్కడకు వచ్చేను. సరిగ్గా నాతో రెండు రోజులు ఉంది. అటు తర్వాత కన్నుమూసింది. ఆ చల్లని వాడి ఆ వెచ్చని చూపు శాశ్వతంగా నా నించి దూరం అయ్యేయి. ఏ కళ్ళలో ఆనందం చూడాలి అనుకున్నానో, ఏ కళ్ళను వెలుగు నింపాలి అనుకున్నానో — ఆ కళ్లు శాశ్వతంగా దూరం అవుతూంటే నేను... నేను సహించలేకపోయేను.

అవి దూరం కాకూడదు.

అవి పంచభూతాల్లో కలిసిపోకూడదు.

అన్న భావనే నా చేత ఒక అంధ పాపకు ఆమె కళ్ళను ట్రాన్స్‌ప్లాంట్ చేసే భావనను ఉదయింపజేసింది.

ఆ పాపే నువ్వుచూసిన స్వీటీ.

ఆ చూపు అమ్మది.

స్వీటీ నా దగ్గర ఉన్నప్పుడు — స్వీటీలా అనిపించలేదు. అమ్మలా అనిపించింది.

అందుకే అలా పులకించిపోయేను.

చిన్నపిల్లాడిలా మారిపోయేను.

కాని... అతని కళ్ళలో విషాదం అలముకుంది.

ఇన్నాళ్ళూ అమ్మ కళ్ళకు దూరంగా ఉన్నాను.

ఇప్పుడు వాటిని చూసింతర్వాత—

అందులోని కాంతుల్ని నేను నింపుకున్న తర్వాత

అమ్మ చూపుని వొదిలేసి నేను దూరం ఎలా వెళ్ళిపోను?"

దుఃఖంతో కంఠం పూడుకుపోయింది.

మిస్టరీ విడిపోయింది.

విజయ్‌ని ఆ స్థితిలో చూస్తూంటే సరిత గుండెలు బాధతో పొంగేయి.

"విజయ్!" అంది ఒక నిముషం ఆలోచించి అతన్ని దగ్గరగా తీసుకుని. ఆమె ముఖంలోకి చూసేడు.

"అమ్మను మన వెంబడే తీసుకువెళ్ళిపోతే—

ఆప్యాయత కురిపించే ఆ వెన్నెలలు ఇద్దరికీ ఎప్పటికీ దక్కుతాయిగా"

"నువ్వు! నువ్వు! ఆలోచించే:.."

"అవును"

విజయ్ సరితను మరీ దగ్గరగా తీసుకున్నాడు.

దూరంలో ఎక్కడో ఉన్నా—

అమ్మ కనులు వెలుగుతో నిండిపోయేయి.